క్లుప్తంగా

పట్టాదారు పుస్తకాలు అందించేందుకు చర్యలు



పట్టాదారు పుస్తకాలు అందించేందుకు లోపాలను సవరిస్తున్న దృశ్యం

మునగపాక: అర్హులైన ప్రతీ రైతుకు పట్టాదారు పుస్తకం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. మునగపాక రెవెన్యూ పరిధిలో కొంతమంది రైతులు ఫొటోలు అందించకపోవడాన్ని గుర్తించిన ఆయన రైతు సంఘం సహకారంతో గురువారం సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘ నేతలు ఫొటోలు లేని వారికి సమాచారం అందించి కార్యాలయానికి తీసుకువచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు ఆడారి మహేష్, సభ్యులు దాడి శివ, వెలగా మురళి, ఆడారి లక్ష్మణరావు, బొడ్డేడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ



పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మునగపాక: పీఏసీఎస్ కార్యాలయం ద్వారా గురువారం యూరియా పంపిణీ నిర్వహించారు. ఇటీవల సొసైటీకి వచ్చిన యూరియాను రైతులకు అందజేస్తున్నారు. గతంలో యూరియా లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించారు. సీజన్‌కు అవసరమయ్యే యూరియాను దఫదఫాలుగా పంపుతున్నారు. ఇప్పటికే దమ్ములు వేగవంతం చేసే పనిలో ఉండడం, దీనికి తోడు యూరియా ఆవశ్యకత కారణంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వచ్చారు. ఏ కొద్దిపాటి వచ్చినా కొనుగోలు చేసేందుకు సొసైటీకి పరుగులు తీస్తున్నారు. గురువారం ప్రతీ రైతుకు ఒక్కొక్క బస్తా మేర అందజేశారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం



వాడ్రాపల్లిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ 14వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులకు పలు రకాల ఆటలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం రాత్రి డాక్టర్ సతీష్‌కుమార్‌తో బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు తెలిపారు. జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాబూరావు జయంతి సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మళ్ల అప్పలనాయుడు, కాండ్రేగుల శ్రీను, కొణతాల శివరామకృష్ణ, మళ్ల జోగినాయుడు, మొల్లేటి రవి, యల్లపు గణేష్, బత్తిన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఛలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది

సబ్బవరం: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే నినాదంతో ఏపీసీపీఎస్‌ఈఏ వచ్చే నెల 1న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. హెచ్‌ఎం బోసు భారతి, సబ్బవరం మండల సీపీఎస్ బాధ్యులు వనం భాస్కర్, డెక్క శ్రీను, ఎర్నిబాబు, ప్రసాద్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి ట్రాఫిక్ ఎస్ఐగా శేషగిరిరావు



అనకాపల్లి: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా శేషగిరిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డీసీఆర్‌బీలో ఎస్ఐగా విధులు నిర్వహించి సాధారణ బదిలీలో భాగంగా అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

ఏకదంతా.. నీవే లోకమంతా

వరసిద్ధి వినాయకుడు వాడవాడలా కొలువుదీరాడు. చలువ పందిళ్లు, భారీ సెట్టింగ్‌లతో ముస్తాబైన మండపాల్లో కొలువైన గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలుచోట్ల ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన బహురూపాల్లో విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం వినాయక చవితి పర్వదినాన్ని ఊరూరా అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు ● ఆకట్టుకున్న వినాయక విగ్రహాలు ● పలు చోట్ల ఘనంగా నిమజ్జనాలు



మునగపాకలో డేంజర్ గాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం వద్ద వినాయకుని నృత్య తాండవం



మునగపాకలో గణనాథులను నిమజ్జనాలకు తీసుకువస్తున్న భక్తులు



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయక నిమజ్జనాలు చేస్తున్న భక్తులు



మునగపాక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఎస్.రాయవరం: గెడ్డపాలెంలో...



ఎస్.రాయవరం: గోకులపాడులో ..



పాయకరావుపేట: పూజిస్తున్న భక్తులు



పాయకరావుపేట: గణనాథుని మండపంలో భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై తీసుకువచ్చి కేరింతల నడుమ ఊరేగింపుగా చవితి వేడుకలను జరుపుకున్నారు. విగ్రహాలను తీసుకువస్తూ నృత్యం చేస్తూ ఉత్సాహంగా గడిపారు. మునగపాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు వినాయక విగ్రహానికి పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మునగపాక డేంజర్ గాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని సందర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శివలింగం ముందు తాండవం చేస్తున్న వినాయక విగ్రహం అలరించింది. సాంబశివుని ఆలయ ప్రాంగణం, జగన్నాథ స్వామి ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ ప్రసాదరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోటవురట్ల: వినాయక చవితిని మండలంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా గణనాథుని విగ్రహాలు వెలియగా విశేష పూజలు చేశారు. వివిధ ఆకృతుల్లో గణేషుని మండపాలు ఆకట్టుకున్నాయి. అనేక రూపాలలో బొజ్జగణపయ్య కనువిందు చేసి పూజలు అందుకున్నాడు. మండల కేంద్రం సీతారామరాజునగర్‌లో బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో కేదార్‌నాథ్ ఆలయం తరహాలో మండపం నిర్మించారు. కైలాసపట్నంలో గణేషుడిని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు దర్శించుకున్నారు. మండపాల వద్ద చిన్నారులు సందడి చేశారు. యువకులు గణపతి బొప్పా మోరియా అంటూ కేరింతలు కొట్టారు.

రాంబిల్లి మండలంలో

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో వినాయక చవితిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనూ చవితి మండపాలను ఏర్పాటు చేసి గణనాథుని కొలువు ఉంచారు. ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి ఏర్పడింది. చిన్నారులు, పెద్దలంతా కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. వాడనర్సాపురంలో సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో నవరాత్రులు వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. రాంబిల్లి, వెంకటాపురం, లాలంకోడూరు, వెల్చూరు, కొత్తపట్నం, సీతపాలెం, దిమిలి తదితర నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.

దిమిలిలో 8 అడుగుల వినాయక విగ్రహం

రాంబిల్లి మండలం ఏటవతల గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. నారాయణపురం, దిమిలి, మురకాడ, కట్టుబోలు తదితర గ్రామాల్లో చవితి వేడుకల సందర్భంగా చిన్నారులు సందడి చేశారు. దిమిలిలోని కోటవీధిలో ఏర్పాటు చేసిన 8 అడుగుల విగ్రహం ఆకట్టుకుంది.

పాయకరావుపేట: వినాయక చవితి సందర్భంగా గణనాథుని మండపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతీ గ్రామంలో వీధి వీధినా గణేషుని విగ్రహాలు కొలువుదీరాయి. విఘ్నాలు తొలగించే గణేషుడిని భక్తులు భక్తిశ్రద్ధలతో పండ్లు, పూలు, ఉండ్రాళ్లతో పూజించారు. రూ.200 నుంచి రూ.20 వేల వరకు విగ్రహాలు కొనుగోలు చేసి వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి కొలువుదీర్చారు. వీధివీధినా విద్యుత్ దీపాలతో మండపాలు కళకళలాడుతున్నాయి.

ఎస్.రాయవరం: మండలంలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంతో మండపాల్లో గణపతి విగ్రహాలు నిలిపి పూజలు నిర్వహించారు. అడ్డురోడ్డు ఎస్.రాయవరం గ్రామాల్లో భారీ విగ్రహాలు నిలిపి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది 9 రోజులతో గణపతి అనుపోత్సవం చేయాల్సిందని పురోహితులు చెప్పడంతో మొదటి రోజు నుంచి మండపాల వద్ద భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు సందడి నెలకొంది.

వినాయక విగ్రహాలను దర్శించుకున్న కంబాల

నక్కపల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని వివిధ గ్రామాల్లో ప్రత్యేక మండపాల వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు దర్శించుకున్నారు. ఒడ్డిమెట్ట, నక్కపల్లి, ఉద్దండపురం, రేబాక, చినదొడ్డిగల్లు, వేంపాడు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు వినాయక ప్రతిమలు, ప్రసాదాలు అందజేశారు. పార్టీ నాయకులు వీసం రామకృష్ణ, పొడగట్ల పాపారావు, పొడగట్ల వెంకటేష్, గొర్ల గోవిందు, తళ్ల భార్గవ్, తిరుపతిరావు, నర్సింహమూర్తి, వేగేశ్న చంటి, బలరామం, నూకన్న నాయుడు, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.



అచ్యుతాపురం: వాడనర్సాపురంలో..



కోటవురట్ల: సీతారామరాజునగర్‌లో..



అచ్యుతాపురం: రాంబిల్లి మండలం దిమిలి కోటవీధిలో 8 అడుగుల విగ్రహం



కోటవురట్ల: కైలాసపట్నంలో వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



మునగపాక జగన్నాథుని ఆలయ సన్నిధిలో వినాయక విగ్రహం



ఉద్దండపురంలో వరసిద్ధి గణపతిని దర్శించుకున్న కంబాల జోగులు

వైభవంగా మరిడిమాంబ ఉత్సవం



మరిడిమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు

కోటవురట్ల: మండల కేంద్రంలో మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు పుట్రేవు సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు శెట్టి రమణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు. ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ నిర్వహించారు. గ్రామం అంతా విద్యుద్దీపాలంకరణ కనువిందు చేసింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా మహాలక్ష్మి జాతర



పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారు

ఎస్.రాయవరం: మండలంలోని వమ్మవరంలో గ్రామ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారి పండగను గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. సాయంత్రం భారీ మందుగుండు సామగ్రి వెలిగించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



మాడుగులలో సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి, తదితరులు నిరసన

మాడుగుల: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మాడుగులలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలపై అనుసరిస్తున్న మొండివైఖరిని విడనాడాలన్నారు. రైతులకు మేలు జరిగేలా చట్టాలు తేవాలన్నారు. అదాని స్మార్ట్ మీటర్లను బిగించొద్దని, విద్యుత్ చార్జీల ట్రూ ఆఫ్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు బషీర్‌బాగ్ కాల్పుల్లో మృతి చెందిన విద్యుత్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుందరరాజు, కె.చిన్న, కె.నాగరాజు, షేక్‌జిలానీ, సాగాని పోతురాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

త్వరితగతిన ఈ- పంట నమోదు చేయండి



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: మండలంలో సత్యవరంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ త్వరితగతిన ఈ- పంట నమోదు పూర్తి చేయాలన్నారు. వరి పంట సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్య పద్ధతి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంట కాలంలో 32 కేజీలు నత్రజని, 24 కేజీలు భాస్వరం, 20 కేజీలు పొటాష్ వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నాగమణి, వీహెచ్ఏ వెంకట అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

కొండ తిరుగుడు గ్రామాల్లో సమస్యల తిష్ట

- ఎన్నికల హామీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం
- అసంపూర్తిగా దర్శనమిస్తున్న సామాజిక భవనాలు
- డ్రైనేజీలకు నోచుకోని గ్రామాలు పట్టని అధికారులు



చెర్లోపాలెంలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న సామాజిక భవనం



డ్రైనేజీ సదుపాయానికి నోచుకోని చెర్లోపాలెం



మడకపాలెంలో మరమ్మతుకు గురైన బోరు



మడకపాలెంలో అధ్వానంగా కాలువ



డ్రైనేజీకి నోచుకోని రామగిరి

మునగపాక: అధికారంలోకి వస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తామంటూ ఊకదంపుడు ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తోంది. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. కొండ తిరుగుడు గ్రామాలాభివృద్ధిపై పాలకులు ఇచ్చిన ఎన్నికల హామీలను విస్మరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చెర్లోపాలెంలో అసంపూర్తిగా సామాజిక భవనం

మండలంలోని కొండ తిరుగుడు గ్రామాల్లో ఒకటైన చెర్లోపాలెంలో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ఏళ్ల తరబడి సామాజిక భవనం అసంపూర్తిగా దర్శనమిస్తుంది. నిధులు చాలక నేటికీ వినియోగంలోకి రాలేదు. డ్రైనేజీ సదుపాయం అంతంత మాత్రంగానే ఉంది. రహదారులున్నా వాటికి అనుబంధంగా డ్రైనేజీ సౌకర్యం కల్పించాల్సి ఉంది. అటువంటి చర్యలు కానరాలేదు. అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

మడకపాలెం, రామగిరిలో వెంటాడుతున్న సమస్యలు....

మడకపాలెం, రామగిరి గ్రామాల్లో సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. కూటమి అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామంటూ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో సిల్టు పేరుకుపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు. రామగిరిలో సామాజిక భవనం నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తుంది.

కొండ తిరుగుడు గ్రామాలపై ఎందుకీ వివక్ష....

కొండ తిరుగుడు గ్రామాల అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు వాపోతున్నారు. మండల కేంద్రానికి దూరంగా ఉండడం కారణంగా తమ గ్రామాల్లో సమస్యలపై అధికారులు శీతకన్ను వేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. కొండ తిరుగుడు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామంటూ ఎన్నికల ముందు నేతలు హామీలు గుప్పించి తీరా అధికారంలోకి వచ్చాక ఎటువంటి చర్యలు చేపట్టడం లేదంటూ బహిరంగంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్థిక సంఘ నిధులు రాగానే పరిష్కరిస్తాం

త్వరలో 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. తద్వారా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. మండల సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన కొండ తిరుగుడు గ్రామాల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

–ఎం.సోమరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎంపీపీ కోన సంధ్యబుజ్జి



శిక్షణ పొందేందుకు వచ్చిన మహిళలతో పరిశ్రమ ప్రతినిధులు, ముఖ్య అతిథులు

అచ్యుతాపురం రూరల్: గ్రామాల్లో మహిళలు ఆర్థికంగా ఎదిగితే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ కోన సంధ్యబుజ్జి అన్నారు. గురువారం అచ్యుతాపురంలో సెయింట్ గోబిన్ సహకారంతో ఆర్‌ఏసీఎల్‌డీ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్, ఫుడ్ ప్రిపరేషన్, సాఫ్ట్ టాయ్స్, కంప్యూటర్ శిక్షణ వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సెయింట్ గోబిన్ ప్రతినిధి శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఇంట్లో భార్యాభర్తలు సంపాదిస్తేనే కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పూడిమడకలో ప్రతిభావంతులు ఉన్నారని, వారికి శిక్షణ కల్పించి ఆర్థికంగా స్థిరపడే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మశ్రీనివాస్, సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు, పంచాయతీ సెక్రటరీ శైలజ, సెయింట్ గోబిన్ పరిశ్రమ ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్ మురుగేషన్, ఆర్‌ఏసీఎల్‌డీ ప్రతినిధులు సౌజన్య, స్నేహ, శిక్షకులు పాల్గొన్నారు.

'మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

పరవాడ: మహిళా చట్టాలపై పూర్తి అవగాహన పొందేందుకు విద్యార్థినులు ముందుకు రావాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత నెల 29న విద్యార్థినిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై స్పందిస్తూ గురువారం కళాశాలను సందర్శించి బాధిత విద్యార్థినిని పరామర్శించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళా శిశు సంక్షేమం ద్వారా అందిస్తున్న సేవలు, ఆడ పిల్లలు, మహళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొంటున్న భద్రత చర్యలను వివరించారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ మాట్లాడుతూ ఆడ పిల్లలు, మహిళల కోసం విశేష సేవలను అందించడానికి 181, 100, 101, 1098, 1930 హెల్ప్‌లైన్ల ప్రాముఖ్యతను తెలిపారు. మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ మాట్లాడుతూ ఆడ పిల్లలు ధైర్యంగా, ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అనకాపల్లి ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి, సబ్బవరం సీడీపీవో లలిత కుమారి, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు, తహసీల్దార్ బి.నాగరాజు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు భూముల్లో వరి పంట నీట మునిగింది. ఆడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఇటీవల వేసిన వరి పంట పూర్తిగా మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులు అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల వరి పంట నీట మునిగింది. మళ్లీ అకస్మాత్తుగా వర్షాలు కురవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. మండలంలో వీరవల్లి శివారు కొత్తూరు వద్ద పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. చెరువులా పంట పొలాలు కనిపిస్తున్నాయి. కె.జె.పురం, ముకుందపురం, మాడుగుల, వీరనారాయణం, తదితర గ్రామాల్లో పల్లపు భూముల్లో వేసిన వరి పంట నీట మునిగింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com